క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెందుర్తి: విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సుజాతనగర్ మెయిన్‌రోడ్డు, శారదానగర్, అంబేడ్కర్ నగర్, శాంతి నగర్, ఇంద్రా ఫంక్షన్ హాల్, చాణక్యనగర్, సూర్యానగర్, శివగాయత్రీ నగర్, చినముషిడివాడ ఏరియా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల సాయత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



మేలు కొలుపు కార్యక్రమంలో పాల్గొన్న సాయి భక్త బృందం

సబ్బవరం: ,ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని సబ్బవరంలో సాయి భక్త బృందం సభ్యులు ఆదివారం మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లోని రామాలయాల్లో సాయి భక్త బృందం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం రామకీర్తలు ఆలపించారు. నెల గంట పెట్టిన నాటి నుంచి భోగి పండగ వరకూ నెల రోజుల పాటు హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా దేశ ప్రజలు పాడిపంటలతో సుభీక్షంగా ఉండాలని కాంక్షిస్తూ మేలుకొలుపు కార్యక్రమాన్ని వేకువ జామునే నిర్వహిస్తారు. కార్యక్రమంలో ముర్రి కనకరాజు,దంగేటి నాని, రమేష్,దనిమిరెడ్డి పాప,పెద్దాడ రమణమ్మ,శంకరరావు,గంగునాయుడు,దంగేటి సీత తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో హాసినికి బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న హాసిని సముద్ర

గోపాలపట్నం: ఆక్వాటిక్ స్విమ్మింగ్‌లో ఆడారి హాసిని సముద్ర ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. నరసారావుపేటలో శనివారం 9వ సబ్ జూనియర్, జూనియర్ ఆక్వాటిక్ అంతర్జాతీయ చాంపియన్‌షిప్ జరిగింది. ఈ పోటీల్లో 104 ఏరియా నేవీ చిల్డ్రన్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న హాసిని సముద్ర ప్రతిభ చూపి.. ఈ నెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరగనున్న 34వ సౌత్ జోన్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఆమె తండ్రి గోపాలపట్నం సీఐ సంతోష్‌కుమార్. పాఠశాల ఉపాధ్యాయుడు వై.వి.కె. ప్రసాద్, వైశాఖీ స్విమ్మింగ్ పూల్ కోచ్ గిరడ రామారావు ఆమెను అభినందించారు.

పిచ్చుకల పరిరక్షణతో పర్యావరణ సమతుల్యత



ఏయూ క్యాంపస్: ప్రకృతిలో అత్యంత విలువైన చిన్న జీవి పిచ్చుకను కాపాడి పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి చిరంజీవి చౌదరి కోరారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆర్గానిక్ మేళాలో భాగంగా సత్వ ఆర్గానిక్స్ నిర్వహించిన వరికంకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులకు దగ్గరగా జీవించే పక్షులకు ఆహారాన్ని అందిస్తూ వాటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పక్షుల పట్ల ప్రేమతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సత్వ నేచురల్స్ అధినేత వి.మధుసూదనరెడ్డి, మేళా నిర్వాహకులు పాల్గొన్నారు.

రయ్.. రయ్

- గతుకులు, గోతుల మార్గానికి చికిత్స
- విజినిగిరిపాలెం ప్రధాన రహదారి అభివృద్ధి
- అంతర్గత రోడ్ల ఏర్పాటు
- సుమారు రూ.కోటితో పనులు
- సాఫీగా సాగుతున్న ప్రయాణం





రెండో దశలో ఎంఎంటీసీ కాలనీ బ్రిడ్జి నుంచి వరాహ పుష్కరిణి వరకు వేసిన బీటీరోడ్డు

సింహాచలం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోంది. శిథిలావస్థలో ఉన్న రోడ్లను సుందరంగా తీర్చిదిద్దింది. నివాసితుల బాధలు తొలగించింది. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను సైతం తీర్చింది. ఇందుకు నిదర్శనమే జీవీఎంసీ 98వవార్డు పరిధి అడవివరం దరి విజినిగిరిపాలేనికి వెళ్లే ప్రధాన రహదారి అభివృద్ధి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 98వ వార్డులో సింహాచలం దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో విజినిగిరిపాలెం గ్రామం ఉంది. పూర్తిగా గ్రామీణ వాతావరణంలో ఉండే విజినిగిరిపాలెంలో సుమారు 500 వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ రోడ్డు గతంలో అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్డు వేయడంతో తమ కష్టాలకు చెక్ పడిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నాడు అధ్వానం.. నేడు ప్రగతి బాట

వరాహ పుష్కరిణి నుంచి విజినిగిరిపాలెం వెళ్లే మార్గంలో ఎంఎంటీసీ కాలనీ, శ్రీకృష్ణానగర్, చంద్రాగార్డెన్స్ తదితర కాలనీలు ఉన్నాయి. శివారు ప్రాంతాలైన ఇవి కూడా నివాసయోగ్యంగా మారాయి. ఆయా గ్రామాల్లో నివాసితుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు విజినిగిరిపాలెం వెళ్లే మార్గంలో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. ఆయా గ్రామాల ప్రజలు సింహాచలం వచ్చి నగరంలోకి వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్ల ప్రధాన రహదారియే శరణ్యం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాకముందు రెండున్నర కిలోమీటర్ల ప్రధాన రహదారి చాలా దారుణంగా ఉండేది. గతుకులు,గుంతలతో రోడ్డు ఉండేది. వర్షం వస్తే రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచేది. దీంతో రాకపోకలు సాగించాలంటే నివాసితులు ఇబ్బందులు పడేవారు. ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయంతో వాహనదారులు ఉండేవారు. తమ బాధలు తీర్చాలని పదేపదే అప్పటి ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.

వైఎస్సార్‌సీపీ వచ్చిన తర్వాత మహర్దశ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విజినిగిరిపాలెంతో పాటు ఆయా కాలనీల ప్రధాన సమస్యకు చెక్ పడింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం రెండు విడతల్లో రోడ్డును అభివృద్ధి చేసింది. మొత్తం రెండున్నర కిలోమీటర్ల మేర బీటీరోడ్డు వేసింది.



విజినిగిరిపాలెం నుంచి ఎంఎంటీసీకాలనీ బ్రిడ్జి వరకు మొదటిదశలో వేసిన బీటీ రోడ్డు

రెండు దశల్లో పనులు

విజినిగిరిపాలెం నుంచి ఎంఎంటీసీ కాలనీ బ్రిడ్జి వరకు ఒక ఫేజ్‌లో, ఎంఎంటీసీ కాలనీ బ్రిడ్జి నుంచి వరాహపుష్కరిణి వరకు రెండో ఫేజ్‌లో బీటీ రోడ్డు వేశారు. అలాగే మట్టి రోడ్లుగా ఉన్న అంతర్గత రహదారులను కూడా బీటీరోడ్లుగా తీర్చిదిద్దారు. ఎంఎంటీసీ కాలనీ వద్ద డ్రైన్లు కూడా ఏర్పాటు చేశారు. మొత్తం రూ. కోటి వ్యయం చేశారు. దీంతో నివాసితుల ఇబ్బందులు తీరాయి.

అన్నదాతలకూ మేలు

రోడ్డు అభివృద్ధి చేయడంతో అన్నదాతలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజిగిరిపాలెం రైతులు పండించిన పంటలను సకాలంలో ఆటోల ద్వారా వారాంతపు సంతలకు చేర్చుకోవడానికి అవకాశం ఏర్పడింది.

రోడ్డు అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పాటు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వారంతా కొనియాడుతున్నారు.

గతుకుల రోడ్డుతో భయమేసేది



నేను విజినిగిరిపాలెంలోనే పుట్టాను. ప్రస్తుతం నాకు 27 ఏళ్లు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. విజినిగిరిపాలెం నుంచి అడవివరం చేరుకోవాలంటే గతుకుల రోడ్డులో వెళ్లాల్సి వచ్చేది. రాత్రి అయితే రోడ్డులో ఎలా ప్రయాణించాలో తెలియని పరిస్థితి ఉండేది. ఆచితూచీ అడుగులు వేయాల్సిన పరిస్థితి ఉండేది. రోడ్డు వేయడంతో ఇబ్బందులు పోయాయి.

– అవినాష్, విజినిగిరిపాలెం

నాటికి...నేటికి ఎంతో వ్యత్యాసం



నేను విజినిగిరిపాలెంలో ఉంటున్నాను. రోజూ విజినిగిరిపాలెం నుంచి అడవివరం ఆటో నడుపుతాను. గతుకుల రోడ్డుతో ఆటో నడిపేందుకు ఇబ్బందులు పడిన పరిస్థితులు అప్పట్లో ఉండేవి. ముఖ్యంగా వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ఉండేది. ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అన్న భయమేసేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మార్గమంతా ఎంతో బాగుంది. ప్రయాణం కూడా సునాయాసంగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.


– శివప్రసాద్, ఆటో డ్రైవర్, విజినిగిరిపాలెం

వెంకటాద్రికి ధనుర్మాస శోభ



వెంకన్నకు పూజలు నిర్వహిస్తున్న ప్రధానార్చకుడు రామానుజమ్, పాల్గొన్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రికి ధనుర్మాస శోభ వచ్చింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ధనుర్మాస పూజలు ఘనంగా ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తిరుప్పావై గోష్ఠి, గోదాదేవి అమ్మవారికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రసాద నివేదన చేశారు. అలాగే ఉదయం వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



విశేష అలంకరణలో గోదాదేవి

సింహాచలం: ధనుర్మాసం పూజలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. సింహాచలం దేవస్థానం కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారిని విశేషంగా అలంకరించి వేదికపై ఏర్పాటు చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. 98వవార్డు సింహపురికాలనీలోని రామాలయంలో ధనుర్మాస పూజలను ప్రారంభించారు. నెల రోజులపాటు గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు భార్గవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యుత్ పొదుపు అవసరం



బుర్రకథ ద్వారా విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెందుర్తి: విద్యుత్‌ను పొదుపు చేయడం ఎంతో ముఖ్యమని ఈపీడీసీఎల్ జోన్–3 పి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని జంగాలపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విద్యుత్ పొదుపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాకారులు విద్యుత్ పొదుపుపై బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. భావి తరాలకు నాణ్యమైన విద్యుత్ అందించాలంటే నేటి నుంచి మనమంతా విద్యుత్తును పొదుపుగా వాడాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేసేందుకు కంకణం కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డీఈ ఎస్.అప్పన్నబాబు, ఏఈ బి.రవి తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు



భాస్కరరెడ్డికి ఏర్పాట్లను వివరిస్తున్న దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ఈసారి ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రముఖుల దర్శనాల క్యూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసి సాధారణ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వీఐపీలు దర్శనానికి వచ్చినప్పుడు దేవస్థానం, రెవెన్యూ అధికారుల మధ్య లైజనింగ్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చినగదిలి తహసీల్దార్ రమణయ్య, దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరాజు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందజేస్తున్న టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళేశ్వరశర్మ

ఎంవీపీ కాలనీ : భగవద్గీతలోని శ్లోకాల కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన నగర యువతకు టీటీడీ ధర్మప్రచార పరిషత్ సూపరింటెండెంట్ చంద్రమౌళేశ్వరశర్మ బహుమతులు అందజేశారు. కర్మయోగం, సంపూర్ణ భగవద్గీతపై ఆదివారం టీటీడీ ఆవరణలో నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆయా కేటగిరీల్లో తొలి మూడు స్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. కర్మయోగంపై నిర్వహించిన పోటీల్లో 6, 7 తరగతుల కేటగిరిలో ప్రథమ స్థానంలో ఎన్.సమన్వత, ద్వితీయ స్థానంలో ఎం.శ్రీనిజ, తృతీయ స్థానంలో శ్యామినీ హిరణ్య విజేతలుగా నిలిచారు. 8, 9 తరగతుల కేటగిరిలో ప్రథమ స్థానంలో కొత్తపల్లి మోక్షిత్, ద్వితీయ స్థానంలో సురకత్తుల నాగదిలీప్ బహుమతులు అందుకున్నారు. సంపూర్ణ భగవద్గీతపై 18 ఏళ్ల కేటగిరిలో జె.శివకుమారి, పి.లీల విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సత్యకుమార్, రమాదేవి, సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నర తులాల బంగారు ఆభరణాల చోరీ



చోరీకి గురైన ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: మండలంలోని రావలమ్మపాలెంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. సీఐ రంగనాథం ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావలమ్మపాలెంలో వర్రి సూర్యనారాయణ కుంటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. భార్య సూర్యకాంతంతో కలిసి శనివారం యధావిధిగా ఇంటికి తాళం వేసుకుని వ్యవసాయ పనులు చేసుకోవడానికి పొలానికి వెళ్లారు. పనులు పూర్తిచేసుకుని మధ్యాహ్నం 12 గంటల సయమంలో తిరిగి ఇంటికి చేరుకునే సరికి మెయిన్ డోర్ తాళం తీసి ఉండడంతో పాటు వెనుకవైపు డోర్ తెరిచి ఉంచడాన్ని గుర్తించారు. నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్టు గుర్తించారు. సూర్యకాంతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన వినోద వల్లరి



ఉప్పల అప్పలరాజును సన్మానిస్తున్న కవులు, రచయితలు

మహారాణిపేట: విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం క్రియేటివ్ కామెడీ క్లబ్ నిర్వహించిన వినోద వల్లరి అలరించింది. విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ముగింపు సందర్భంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమం జరిగింది. హాస్యరత్న వేముల భాస్కరాచారి, కుమారి మల్లిక, తాళాభక్తుల లక్ష్మీప్రసాద్, సరగడ చిన్నరెడ్డి, పద్మ ప్రదర్శించిన కామెడీ స్కిట్లు, జోకులు, పేరడీ సాంగ్స్, జానపద గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమ ప్రారంభానికి ముందు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజును క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు మేడా మస్తాన్‌రెడ్డి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో కె.వి.ఎస్.మూర్తి, వెలమల సిమ్మన్న, పరమేశ్వరరావు, పి.ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పింఛన్‌దారుల దినోత్సవం



రైల్వే పెన్షనర్లకు జ్యూట్ బ్యాగులను బహూకరిస్తున్న గల్లా భాస్కరరావు

తాటిచెట్లపాలెం: రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేగి నాగేశ్వరరావు అధ్యక్షతన రైల్వే న్యూకాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్‌లో లోకో పైలట్‌గా పనిచేస్తూ కోవిడ్ సమయంలో మరణించిన గల్లా ఆనంద గిరివాసు జ్ఞాపకార్థం ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా సభ్యులందరికీ జ్యూట్ బ్యాగ్‌లను అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గల్లా భాస్కరరావు చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్ వంటి పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ ఎస్.ప్రవీణ్, డాక్టర్ శ్రీకాంత్ గుండె, కీళ్ల వ్యాధులపై అవగాహన, చికిత్స మార్గాలను వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దొండపర్తి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి.కె.మహాపాత్రో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ అధికారులు జి.వి.బాలభాస్కరరావు, చంద్రమోహన్ వృద్ధాప్య దశలో ఆర్థిక భద్రత మీద పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జీఎస్ఎం ఎంవీవీ సత్యసాయిబాబా, ఎస్.మసేను, ఎస్.బి.షా, మదీనా వలీ, కె.వై.నాయుడు, రైల్వే పెన్షనర్స్ పాల్గొన్నారు.

అయ్యో.. పాపం

- వృద్ధుడిని వదిలించుకున్న కన్న పిల్లలు
- ఆదుకున్న జీవీఎంసీ ఏయూటీడీ సిబ్బంది



వృద్ధుడిని ప్రశ్నిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

అల్లిపురం: వయసులో ఉన్నప్పుడు సంపాదించాడు. పిల్లలను పెంచి, పెద్ద చేశాడు. వారికి పెళ్లిళ్లు కూడా చేశాడు. ప్రస్తుతం ఆయన వయసు మళ్లింది. వయోభారంతో నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో పిల్లలు వదిలించుకోవాలనుకున్నారు. రెండు రోజుల కిందట రాత్రి సమయంలో ఆ వృద్ధుడిని తీసుకువచ్చి జగదాంబ జంక్షన్‌లో సీఎంఆర్ జ్యువెలరీ వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయారు. రెండు రోజులుగా చలిలో కదల్లేని స్థితిలో పడి ఉన్న ఆ వృద్ధుడి విషయాన్ని తెలుసుకున్న భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, తన సిబ్బందితో వెళ్లి తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. అతనికి సపర్యలు చేసిన అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనది విజయనగరం గంట స్తంభం ప్రాంతమని ఆ వృద్ధుడు తెలియజేశారు.

వృద్ధురాలి అదృశ్యం



ఆవాల దేవుడమ్మ

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామానికి చెందిన వృద్ధురాలి అదృశ్యంపై సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రంగనాథం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపుర అగ్రహారం గ్రామానికి చెందిన ఆవాల దేవుడమ్మ(62)కు చెందిన వృద్ధురాలు ఈ నెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదు. అదేరోజు ఉదయం 8 గంటల సమయంలో పాసింజర్ ఆటో ఎక్కి సబ్బవరం జంక్షన్‌లో దిగినట్లు కుంటుంబ సభ్యులకు కొంత మంది సమాచారం అందించారు. దీంతో గ్రామ పరిసర ప్రాంతాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వెతికినప్పటికీ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కుమార్తె కాగిత లక్ష్మి శనివారంపోలీసులకు ఫిర్యాదు చేశారు.

నగర పురవీధుల్లో గీతా శోభాయాత్ర



శోభాయాత్ర ప్రారంభిస్తున్న కృష్ణమూర్తి, విశ్వేశ్వరరావు

డాబాగార్డెన్స్: గీతా జయంతిని పురస్కరించుకుని గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం నగర పురవీధుల్లో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్ కొత్తరోడ్డు, రీడింగ్ రూమ్, కురుపాం మార్కెట్ మీదుగా పాతనగరం రాజప్ప నాయుడు వీధిలోని గీతాభవన్ వరకు సాగింది. యాత్ర పొడవునా ప్రచార సమితి మహిళా సభ్యులు, భక్తులు సామూహికంగా భగవద్గీత శ్లోకాల పారాయణం, శ్రీవిష్ణుసహస్రనామాలు పఠించారు. గోవింద నామ సంకీర్తన చేశారు. గీతా ఉపదేశం చేస్తున్నట్టు శ్రీకృష్ణార్జునల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమితి గౌరవ అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు జెండా ఊపి శోభాయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పి.జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం.వనజాదేవి, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రెండు పుస్తకాల ఆవిష్కరణ

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమంచి వినయ భూషణ రావు రచించిన 'కథా బృందావనం', 'చిత్ర కవితా సరం' పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆచార్య బాలమోహన్‌దాస్ పుస్తకాలను ఆవిష్కరించారు.